క్లుప్తంగా

స్పోర్ట్స్ షూస్ అందజేత



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులకు షూస్‌లను సోమవారం అందజేశారు. వావిలాల చిన్న ఎల్లయ్య, చిటమట లావణ్య, చిటమట వసంత సహకారంతో అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు.

నలుగురిపై కేసు

వెంకటాపురం(ఎం): మండలంలోని ఇంచెంచెరువుపల్లెలో ఒకరిపై దాడి చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇంచెంచెరువుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, భార్య శకుంతలతో కలిసి ఇంట్లో ఉండగా ఇదే గ్రామానికి చెందిన కత్తుల ప్రభాకర్, యమున, వీరస్వామి, కల్యాణిలు భూతగదా విషయంలో ఇంట్లో చొరబడి కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మండల కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం: కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల ఇన్‌చార్జ్ దేవేందర్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా జాడి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా సుమన్, ఉపాధ్యక్షులుగా మంగళారపు సత్యం, శోభన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గం ప్రభాకర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పరామర్శ



మంగపేట: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ కొద్ది రోజుల నుంచి మలేరియా, టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో బాధితుడిని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రమణక్కపేటలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పలు రాజకీయ అంశాలపై చర్చించారు. గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాటూరి ఏడుకొండలు, సాంబులు, ఉద్యమ కారులు జగదీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మంగపేట: మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని బొమ్మాగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వట్టం పుల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడు చుంచుపల్లి పీహెచ్‌సీ ఫార్మసిస్టు హిమకిరణ్, కుటుంబ సభ్యులను బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ సోమవారం పరామర్శించారు. మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్, మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు కల్లి రమకృష్ణ, నాయకులు ఎస్‌డి నాగుల్‌మీరా, మహిపాల్‌రెడ్డి, సాంభయ్య, రమేష్, ప్రశాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

'1001 రకం ధాన్యంతో నష్టపోతున్నాం'

టేకుమట్ల(రేగొండ): 1001 రకం ధాన్యంతో నష్టపోతున్నామని జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రేగొండ మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. రైతులు 1001 రకానికి చెందిన పంటను ఎక్కువగా వేస్తున్నారని తెలిపారు. ఈ రకం వడ్లతో మిల్లింగ్ చేసి, సీఎంఆర్ ఇవ్వలేక పోతున్నామని మిల్లర్లు నష్టాలను చవి చూస్తున్నారని వాపోయారు. కావున యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్, ఐకేపీ సెంటర్‌లలో 1001 రకం మినహాయించి ఎంటీయూ, 1061, 1064, 1224, 1262 లను కొనుగోలు చేసి మిల్లర్లకు పంపించాలని అన్నారు. అనంతరం రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ హింగె మహేందర్‌జీ, రేగొండ మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు.

సాగునీటి కష్టాలు



వాగులో ఇసుక బస్తాలు అడ్డుగా వేసిన రైతులు



గౌరారం వాగు

- ఇసుకతో నిండిపోయిన చెక్‌డ్యాం
- కొత్తగా నిర్మించాలని రైతుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: వ్యవసాయ పంటల సాగు నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే వాగు ఉన్న సాగు నీటి కోసం కష్టాలు తప్పడం లేదు. మండలంలోని నర్సాపూర్ గౌరారం వాగు రైతులు వ్యవసాయ పంటలకు అనుకులంగా ఉంది. వాగు ఆయకట్టు కింద నర్సాపూర్, పంబపూర్, కటాపూర్ గ్రామాల రైతులకు చెందిన సమారు 700 ఎకరాలు సాగు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం రైతుల సాగు నీటి కోసం గౌరారం వాగుపై చెక్‌డ్యాం, తూము నిర్మించారు. క్రమేపి వాగు వరదకు ఇసుకలో కమ్మేసింది. దీంతో తూము ద్వారా వ్యవసాయ పంటలకు నీళ్లు పారడం లేదు. రైతులు గత నాలుగైదేళ్ల నుంచి ఇసుక కమ్మేసిన చెక్‌డ్యాం ప్రాంతంలో ఇసుక బస్తాలను వాగుకు అడ్డంగా వేసి తూము ద్వారా నీటిని వ్యవసాయ పంటలకు మళ్లీస్తున్నారు. ప్రతీ ఏటా ఇసుక బస్తాలు అడ్డు వేసిన అనుకున్న మేరకు తుము నుంచి కాల్వల ద్వారా పంటలకు సరిపడ నీళ్లు అందడం లేదని రైతులు చెబుతున్నారు. వాగులో నీటి నిల్వ కోసం చెక్‌డ్యాం నిర్మించడంతో తూముకు మరమ్మతులు చేపట్టాలని రైతులు, సర్పంచ్ పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు కూడా విన్నవించిన ఫలితం లేదంటున్నారు. వాగుపై చెక్‌డ్యాం నిర్మించి తూము మరమ్మతులు చేపడితే వ్యవసాయ పంటలకు సాగు నీటి ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చైక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గౌరారం వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పిన పట్టింపు చేయడం లేదు. ఇంజనీరింగ్ అధికారులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతూ దాట వేస్తున్నారు. ఇటీవల ఐటీడీఏ పీఓ అంకిత్ కూడా కలిసి వినతి ప్రతం అందజేశా. అధికారులు స్పందించి చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

- మంకిడి నరిసింహస్వామి, సర్పంచ్

రిటైర్డ్ ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న దాస్

ములుగు: రిటైర్డ్ ఉద్యోగులకు నిబంధనల మేరకు ప్రభుత్వం తరఫున అని రకాల సౌకర్యాలను కల్పించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి క్రిస్టియన్ దార్ కోరారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో నిర్వహించిన నిరసన దీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు అన్ని కార్పోరేట్ ఆస్పత్రులలో నగదు రహిత వైద్యం అందించాలని, ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ మూడు నెలల డీఏను వెంటనే అందించేందుకు చర్యలను తీసుకోవాలని కోరారు. సర్వీస్ ఆధారంగా పెన్షనర్ల వివరాలను తెలియజేయాలన్నారు. అనంతరం డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి విజయలక్ష్మి, సారయ్య, శ్యామల్ నాయక్, సుందర్ రావు, పుల్లయ్య, రామ్మూర్తి, బుచ్చయ్య, రామ్ రెడ్డి, నదసమ్ములు, సంపత్ రావుతో పాటు తదితరులు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మైపతి అరుణ్‌కుమార్

మంగపేట: జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న సామాజిక న్యాయ వేదిక తొలి ఆవిర్భావ సదస్సుకు అన్ని కులసంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కమలపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద సామాజిక న్యాయవేదిక కరపత్రాన్ని అరుణకుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమక్క–సారలమ్మ పోరుగడ్డలో మొలకెత్తిన విత్తనమే సామాజిక న్యాయవేదిక ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

ములుగు: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీతక్కను అధిక మెజారిటీతో గెలిపించాలని ములుగు మండల ఇన్‌చార్జ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రములో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రతి ఇంటికి తిసుకుపోవాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్ కుమార్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఎర్రబెల్లి దేవేందర్ రావు, కాగితపు దేవేంద్ర చారి, ఆర్శం రఘు, ప్రధాన కార్యదర్శులుగా దూడ బోయిన వేణు యాదవ్, భూక్యా బాలాజీ, గుండబోయిన మహేందర్‌గౌడ్, కోశాధికారిగా ప్రకాష్, కార్యదర్శులుగా జెట్టి విజయ, గొల్లవెన మొగిలి, బొమ్మరవేని శివకృష్ణ, కోలిపాక సాంబయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి బాగవాన్, ఫిషర్ మెన్ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, బొక్క సత్తిరెడ్డి, రాజు, జిల్లా అధికార ప్రతినిధి ముషినపెల్లి కుమార్‌గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, అశోక్‌గౌడ్, రసుపుత్ సీతారాం నాయక్, జంపాల ప్రభాకర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదు



పస్రాలో మాట్లాడుతున్న ఇరుగు పైడి



మంగపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగు పైడి మాదిగ అన్నారు. సోమవారం పస్రాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగపేట మండలంలో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరయ్య అనడం అంబేడ్కర్‌ను అవమానించినట్లే అని అన్నారు. తక్షణమే అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మడిపెల్లి శ్యాంబాబు, దుర్గారావు, సారయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని వినతి

మంగపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషించిన వీరయ్యపై చర్య తీసుకోవాలని కోరుతూ అంబేడ్కర్ యువజనసంఘం మండల కమిటీ ఆధ్వర్యంతో తహసీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు బసారికాని హరికృష్ణ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని రిజర్వేషన్‌తో టీచర్ ఉద్యోగం పొంది రాజ్యాంగాన్ని, ఈ ప్రాంతంలో ఉన్న అనగారిన కులాలను దూషిస్తున్న వీరయ్యను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారంగా ఆయనపై చర్యలు తీసుకోని ఎడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఎంపెల్లి సమ్మయ్య, పరికి శ్రీనివాస్, మేడిద సతీష్, కోడెల నరేష్, నిమ్మగడ్డ ప్రవీణ్, బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాతను సన్మానిస్తున్న అజ్మత్‌ఖాన్

ఏటూరునాగారం: రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడమే అవుతుందని రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్‌ఖాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏటూరునాగారం బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదానం చేసిన దాతలకు అజ్మత్ ఖాన్ సన్మానించారు. సహాయ నిధికి రూ.1000ల విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్లడ్ డోనర్స్ వల్ల వందలాది మందికి రక్తం ఉచితంగా లభిస్తోందన్నారు. ఎందరినో ఆపదలో ఆదుకుంటుందని, బ్లడ్ డోనర్స్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వహిద్, రాజేష్, మురళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి



గుడాడ్‌పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ ప్రభుత్వం సాదాబైనామాను అమల్లోకితీసుకువచ్చి దరఖాస్తు చేసుకున్నా రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ డిమాండ్ చేశారు. పల్లె పల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపెల్లి (ఎస్ఎం), మోరంచపల్లి, కొంపల్లి, గుడాడుపల్లి, శ్యామ్‌నగర్ గ్రామాల్లో ఓబీసీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రాజేందర్ మాట్లాడుతూ.. ఏ గ్రామం వెళ్లిన రైతులు పట్టా పాసుపుస్తకాలు రాలేదని, సాదాబైనామాలో దరఖాస్తులు చేసుకొని మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేదని దీంతో రైతుబంధు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధరణి వల్ల ఎప్పుడో అమ్ముకున్న భూస్వాములు మా భూములంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో రైతుల పక్షాన ధరణి పోర్టల్ సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బట్టు రవి, గీస సంపత్, నాంపల్లి కుమార్, సమ్మయ్య, నిమ్మల కుమార్, జంజర్ల సురేష్, నడిగట్టు శ్రీనివాస్, మహేష్, రెంటాల రాజిరెడ్డి, కోటేశ్వర్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మంగపేట: మండలంలోని రాజుపేటలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు సభ్యులు మజ్జిగ ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. వేసవి కాలం దృష్ట్యా ఎండలు, వడ గాల్పుల నుంచి విద్యార్థులు ఉపశమనం పొంది ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆకాంక్షిస్తు ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సబ్యులు ఆదినారాయణ, రమేష్, మహేష్, పుష్పంత్, లోకేష్, తేజ, నాగరాజు, వెంకట్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థులు

మల్హర్: రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఆటో బోల్తా పడి పదో తరగతి విద్యార్థులకు గాయాలైన సంఘటన మండలంలోని తాడిచర్ల ఎర్రగుంట చెరువు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు తాడిచర్లలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాశారు. తిరిగి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో తాడిచర్ల ఎర్ర గుంట చెరవు సమీపంలోని మూలమలపు వద్ద రోడ్డుపై ఉన్న గుంతను డ్రైవర్ తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మల్లారం, చిన్నతూండ్ల గ్రామాలకు చెందిన విద్యార్థులు స్వరూప, హరీష్, ప్రణీత్, హరిత, మరొకరికి గాయాలయ్యాయి. వారిని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. తీవ్ర గాయాలయిన స్వరూప, హరీష్‌లను 108 వాహనం ద్వారా భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. ఆటోలో 9 విద్యార్థులు ప్రయాణించగా ఐదుగురికి గాయాలయ్యాయి.

గుట్టలగంగారంలో వైద్య శిబిరం



గుట్టలగంగారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గుట్టలగంగారంలో ఎస్‌యూఏ నర్సింహారావు ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ దోమలను నివారించుకోవాలని, దోమల వలన కలుగు నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, భాస్కర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ములుగు రూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించిందని అన్నారు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు అందిస్తామని తెలిపిందని అన్నారు. ఈ పథకంలో రాజకీయ జోక్యం లేకుండా గ్రామ సభల ద్వారా అర్హులైన పేదలను ఎంపిక చేయాలని అన్నారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఈ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్, సారయ్య, రాజిరెడ్డి, వెంకన్న, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జెన్‌కో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆవుల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చెల్పూరు జెన్‌కో గేట్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ జెన్‌కో ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థ స్పందించంటే ఈనెల 25నరాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విధును బహిష్కరించి సమ్మెకు దిగడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

చిట్యాల: శ్రీ శ్రీ కళావేదిక వారి ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ నెల 9, 10 వ తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో సాహితీ రంగం నుంచి చిట్యాల మండలంలోని జడలపేటకు చెందిన కవి, రచయిత ఆర్టిస్ట్ పుట్టకొక్కుల రవీందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులపై తన గాత్రాన్ని వినిపించిన రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు కత్తిమండ ప్రతాప్, శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ ప్రపంచ సాహిత్య సాంస్కృతిక అకాడమీ, పిల్లంగోల శ్రీలక్ష్మి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ రమావతి పాల్గొన్నారు.

ములుగుపల్లిలో 'కంటి వెలుగు'



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దూలం మల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని ములుగుపల్లి గ్రామంలో నిర్వహించిన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటిపరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బండి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీల, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.